సాక్షి ఒడిశా

ఆదివారం । 26 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,82,750లు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ముగిసిన 'బార్' ఎన్నికలు

- వివిధ కోర్టుల్లో ఓటు హక్కు వినియోగించుకున్న న్యాయవాదులు

- 8లో



390 కిలోల గంజాయి పట్టివేత

- 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో దీక్షలు



నెహ్రూనగర్‌లో దండనాచా దీక్షలు చేస్తున్న భక్తులు

జయపురం: గంజాం జిల్లాలో ప్రసిద్ధి చెందిన దండనాచా దీక్షలు పట్టణంలోని నెహ్రూనగర్‌లో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయ వాయిద్యాలతో దండనాచా కళాకారులు గుంపులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి, నృత్యాలు చేస్తారు. నెమలి వెంట్రుకులతో పాటు పవిత్ర జెండాలతో శివుడు, కాళికా అమ్మవార్లకు పూజిస్తారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడికి గాయాలు



మోహానా పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బబ్బురు మల్లిక్

పర్లాకిమిడి: తేనెటీగల దాడిలో వృద్ధుడు గాయపడిన ఘటన జిల్లాలోని మోహానా బ్లాక్ మెరాపల్లి పంచాయతీ బొందుగుడ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బబ్బురు బహాన్ మల్లిక్(70) అనే వృద్ధుడు విప్పపువ్వు సేకరించేందుకు గ్రామం సమీపంలోని అడివిలోకి వెళ్లాడు. చెట్టుపై ఉన్న తేనెటీగలు అకస్మాతుగా దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు బాధితుడిని మోహానా పీహెచ్‌సీకి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు.. ప్రాణాపాయం లేదని తెలిపారు.


కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికలు



గజపతి స్టేడియంలో ఎంపికలకు సిద్ధమవుతున్న యువకులు

పర్లాకిమిడి: జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. జిల్లా పోలీసుశాఖ, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ పర్యవేక్షణలో స్థానిక గజపతి స్టేడియంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఫిబ్రవరి మొదటి వారంలో జరిగిన రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి గుమ్మా రోడ్డులో పరుగుపందెం, గజపతి స్టేడియంలో హైజంప్, లాంగ్‌జంప్ తదితర పరీక్షలు చేపట్టారు. ఇందులో 207మంది హాజరయ్యారని పోలీసు అధికారులు తెలిపారు.

ఓయూహెచ్‌ఎస్ వీసీగా ప్రొఫెసర్ హొత్తా



ప్రొఫెసర్ దత్తేశ్వర్ హొత్తా

భువనేశ్వర్: నగరంలోని ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(ఓయూహెచ్‌ఎస్) వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ దత్తేశ్వర్ హొత్తా నియమితులయ్యారు. ఈ యూనివర్సిటీకి ఆయన తొలి వైస్ ఛాన్సలర్‌గా నియమితులు కావడం విశేషం. రాష్ట్రంలోని యూనివర్సిటీల ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ గణేషలాల్ ఆమోదం మేరకు ఈ ప్రక్రియ జరిగింది. ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ చట్టం, 2021 సెక్షన్ 9, సబ్-సెక్షన్(7) కింద ఆయనకు నియమించినట్లు యూనివర్సిటీ ఛాన్సలర్ కార్యాలయం జారీ చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. ప్రొఫెసర్ హొత్తా ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్-ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఏడాది పాటు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ఈ హోదాలో కొనసాగుతారు. రాష్ట్రంలోని అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, నర్సింగ్, ల్యాబ్ టెక్నాలజీ, ఇతర పారామెడికల్ సైన్సెస్‌లో సార్వత్రిక నాణ్యమైన ఆరోగ్య విద్యను అందించడానికి ఈ యూనివర్శిటీని ఏర్పాటు చేశారు. దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ 107వ జయంతి పురస్కరించుకుని ఈనెల 5న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఆమోదించారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య, అనుబంధ ఆరోగ్య శాస్త్ర కళాశాలలు, సంస్థలు ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు అనుబంధంగా పరిగణించబడతాయి. ఈ క్రమంలో ఆయా సంస్థలు పని చేస్తాయని గతంలోనే స్పష్టం చేశారు.

నేలతల్లికి నేను సైతం..



పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయక్ ఆవిష్కరించిన సైకతశిల్పం

భువనేశ్వర్: 'ప్రతిఫలం ఆశించకుండా నేలతల్లి నిరంతరం మానవాళి మనుగడకు అండగా నిలుస్తోంది. వాతావరణ సమస్యలతో మన గ్రహం క్షీణించి పోకుండా జాగ్రత్త వహించడం సమగ్ర మానవాళి బాధ్యత'గా అంతర్జాతీయ సైకతశిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఎర్త్ అవర్ కార్యక్రమం పురస్కరించుకుని శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు గంట పాటు విద్యుద్దీపాలను ఆపి వేసి, మానవాళి సమగ్రంగా పాలుపంచుకోవడం పుడమితల్లి సంరక్షణ చైతన్య కార్యక్రమంలో భాగంగా గుర్తించాలని కోరారు. ఈ నినాదంతో ఆయన పూరీ సాగర తీరంలో ఆకర్షణీయమైన సైకతశిల్పాన్ని తీర్చిదిద్దారు. అలాగే ఎర్త్ అవర్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా నవీన్ నివాస్‌లో గంట పాటు విద్యుత్ దీపాలు ఆపి వేస్తున్నట్లు వెల్లడించి, రాష్ట్ర ప్రజలను చైతన్య పరిచారు. గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడానికి, విద్యుత్‌ను ఆదా చేసేందుకు ప్రపంచ ప్రతిజ్ఞలో చేరాలని అందరినీ కోరారు.

ఆకాశంలో ఒక తార..

భువనేశ్వర్:

శుక్రవారం రాత్రి ఆకాశంలో అరుదైన దృశ్యం కనిపించింది. చంద్రునికి అతి సమీపంలో ప్రకాశవంతమైన నక్షత్రం కనిపించింది. ఇలాంటి అందమైన దృశ్యాన్ని స్థానికులు కొందరు ఇళ్లపై నుంచి తిలకించగా.. మరికొందరు తమ సెల్‌ఫోన్లలో బంధించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే పూరీ జగన్నాథుని శ్రీమందిరం ఆలయ శిఖరాన పతిత పావన పతాకం పరిసరాల్లో మరింత స్పష్టంగా ఆకర్షణీయంగా తారసపడడం విశేషం. దీనిపై భువనేశ్వర్ లోని పఠాణి సామంత్ ప్లానిటోరియం డిప్యూటీ డైరెక్టర్ శుభేందు పట్నాయక్ మాట్లాడుతూ.. 2015లో ఒకసారి, మళ్లీ ఇన్నాళ్లకు ఈ దృశ్యం తారస పడిందని తెలపారు. భూమి, చంద్రుడు, శుక్రుడు ఒకే సరళ రేఖలో ఉండటంతో ఈ విధంగా కనిపిస్తుందన్నారు. తాజా దృశ్యంలో శుక్రుడు కొంత సమయం చంద్రుడి వెనుక ఉండిపోవడంతో ఈ విధంగా జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ సాయంత్రం 4.27 గంటలకు ప్రారంభం కాగా, వెలుగు ఉండటంతో భారతదేశంలో కనిపించ లేదన్నారు. సాయంత్రం 6 గంటలకు శుక్రుడు చంద్రునికి చాలా సమీపానికి రాగా.. ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాల్లో దీనిని పూర్తిగా చూడగలిగారని వెల్లడించారు. శుక్రుడు, చంద్రుని వెనుక దాక్కుని ఒక చివరలో ప్రవేశించి, మరొక వైపు నుంచి నిష్క్రమించినట్లు వివరించారు. ఈ దృశ్యం రాత్రి 8.30 గంటల వరకు ఆకాశంలో కనిపించింది. మరోవైపు ఈనెల 25నుంచి 30వరకు ఒకే వరుసలో 5 గ్రహాలు కనిపించనున్నాయని సమాచారం. ఈ వ్యవధిలో బుధుడు, శుక్రుడు, బృహస్పతి, అంగారకుడు, యురేనస్, చంద్రుడు సరళ రేఖలో కనిపిస్తారు. ఈనెల 25న సూర్యాస్తమయానికి 45 నిమిషాల తర్వాత ఒకే సరళ రేఖలో 5 గ్రహాలను చూడవచ్చని శుభేందు పట్నాయక్ సూచించారు.



ఆకాశంలో కనువిందు చేస్తున్న నెలవంక, శుక్రుడు



పూరీ శ్రీమందిరం ఆలయ శిఖరాన పతాకం వద్ద కనిపిస్తున్న నెలవంక

ఏప్రిల్‌లో సీఎం జపాన్ పర్యటన

- రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం
- ప్రత్యేక ప్రతినిధి బృందంతో బయల్దేరే అవకాశం



సీఎం నవీన్ పట్నాయక్



ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ దివ్యజోతి పరిడా, ఎస్పీ జగ్‌మోహన్, అధికారులు

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఏప్రిల్ మొదటి వారంలో జపాన్ పర్యటనకు సిద్ధం అవుతున్నట్లు అధికారిక వర్గాలు శనివారం తెలిపాయి. వారం రోజుల పాటు ఈ పర్యటనలో పాల్గొంటారని సీఎం కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్రానికి అధిక పెట్టుబడులు ఆకట్టుకునేందుకు పీఎం ప్రత్యక్షంగా జపాన్ సందర్శిస్తున్నట్లు వెల్లడించారు. 2018, 2022 సంవత్సరాల్లో ఆగ్నేయాసియా దేశాలు రాష్ట్రప్రభుత్వ కార్యక్రమం మేక్ ఇన్ ఒడిశా(ఎంఐఓ)లో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆ దేశంలోని అగ్రశ్రేణి పెట్టుబడిదారులతో ముఖ్యమంత్రి సమావేశమై, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకు వస్తారని భావిస్తున్నారు. ఆహార ఉత్పాదన, రసాయనాలు, ప్లాస్టిక్స్, పెట్రో కెమికల్స్, జౌళి, వస్త్రాలు, పర్యటన రంగాల్లో తన స్నేహపూర్వక మంతనాలతో పెట్టుబడులకు ఒడిశా అనుకూలమైనదిగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రతినిధి బృందంతో బయల్దేరుతున్నారు. రాజకీయ స్థిరత్వం, సుస్థిర ప్రభుత్వ పాలన, అనుకూలమైన వ్యాపార వాతావరణం పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలమైన ప్రాంతంగా వివరించనున్నారు. రాష్ట్రం ప్రాధాన్యత కలిగిన పెట్టుబడి గమ్యస్థానంగా ఉద్భవించిందని, గతంలో కుదిరిన ఒప్పందాల మేరకు ఇప్పటి వరకు ప్రతిపాదనల్లో 45శాతం వాస్తవ పెట్టుబడులు కార్యరూపం దాల్చాయని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ప్రతాప్ కేశరీ దేవ్ ప్రకటించారు. మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్-2022 ప్రభావంతో 10 లక్షల 50 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశంతో రూ.10.50 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు అందినట్లు వివరించారు. అంతకుముందు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్‌లో పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో జరిపిన సంప్రదింపులు ఆశాజనకంగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌లో జరిగిన విదేశీ పెట్టుబడుల సదస్సులో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా పాల్గొని రూ.22 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను స్వీకరించారని గుర్తుచేశారు.

నేడు సొంత జిల్లాకు..

బరంపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన సొంత జిల్లా గంజాంలో ఆదివారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఉదయం 10.20 గంటలకు రాజధాని భువనేశ్వర్‌లోని ఆయన నివాసం నుంచి బిజూ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొని, ప్రత్యేక హెలీకాప్టర్‌లో సరగడా వెటర్నరీ కార్యాలయ మైదానానికి చేరుకోనున్నారు. అక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అక్కడి నుంచి హింజిలికాట్ చేరుకొని వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతారు. అనంతరం సర్క్యూట్ హౌస్‌లో అధికారిక విందులో పాల్గొంటారు. అక్కడి నుంచి కబిసూర్యనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అలాగే జిల్లా కేంద్రం ఛత్రపూర్ పోలీసు మైదానంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివ్యజోతి పరిడా, గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మినా శనివారం పర్యవేక్షించారు.

అందరి కృషితోనే విజయవంతం



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు


- మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు



మాట్లాడుతున్న నెక్కంటి, పక్కన కుముంధాన్, రామకృష్ణ

రాయగడ: జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉగాది వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయని, సమష్టి కృషి ఫలితంగా విజయవంతమయ్యాయని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక రాణిగుడ ఫారంలోని ఆయన నివాసంలో ఉత్సవ కమిటీ, పట్టణ ప్రముఖులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు అంతా కలసికట్టుగా పనిచేయాలని కోరారు. ఇకపై ఏటా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలుగు పండగలు జరుపుకొనేలా అంతా సహకరించాలన్నారు. ఐఖ్యతను చాటే విధంగా ఈసారి ఉగాది పండగను జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి, ఒడియా ప్రజలు కూడా రావడం, కార్యక్రమాల్లో ఆశాంతం వెన్నంటే ఉండి, సంఘీభావాన్ని తెలియజేయడంపై హర్షం వ్యక్తంచేశారు. సమావేశంలో ఉగాది ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు చంద్రమౌళి కుముంధాన్, కార్యదర్శి మహేష్ పట్నాయక్, శిల్లా జగన్నాథరావు, రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

వికటించిన శస్త్రచికిత్స



శస్త్ర చికిత్సతో ప్రాణాలు కోల్పోయిన తెల్ల నెమలి

భువనేశ్వర్: శస్త్రచికిత్సతో నెమలి పొట్ట నుంచి గుడ్లు తొలగించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఈ నేపథ్యంలో నగరం శివారులోని బారంగ్ నందన్‌కానన్ జూలో తెల్ల నెమలి మృతి చెందింది. కొన్ని రోజులుగా నెమలి తినకుండా, తాగకుండా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు జూ వర్గాలు గుర్తించారు. ఈ నేపథ్యంలో అల్ట్రాసౌండ్ పరీక్షలు చేపట్టగా, నెమలి కడుపులో రెండు గుడ్లు ఉన్నట్లు గుర్తించారు. అయితే ఇవి అస్తవ్యస్తంగా చోటు చేసుకోవడంతో పక్షి బాధపడుతున్నట్లు ధ్రువీకరించారు. శస్త్రచికిత్సతో ఈ గుడ్లు తొలగించాలని వైద్య పరిశీలనలో నిర్ధారించారు. దీంతో నెమలిని స్థానిక పశు వైద్యశాలకు తరలించారు. అక్కడ గుడ్లు తీసేందుకు శస్త్రచికిత్స చేస్తుండగా తెల్ల నెమలి మృతిచెందింది.

కోచింగ్ సెంటర్‌లో నకిలీ సర్టిఫికెట్లు



ముద్రణ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భువనేశ్వర్: నకిలీ ధ్రువపత్రాల ముద్రణ కేంద్రం గుట్టు రట్టయింది. పోలీసుల ఆకస్మిక దాడుల్లో ఈ వ్యవహారం బట్టబయలైంది. బొలంగీర్‌లో నకిలీ సర్టిఫికెట్లతో పోస్టల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కేసులో 8మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బొలంగీర్ కాలేజ్ స్ట్రీట్‌లోని రిలయన్స్ కోచింగ్ సెంటర్‌పై పోలీసులు దాడి చేశారు. వందల సంఖ్యలో నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామీణ తపాలాశాఖ దరఖాస్తుల్లో నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చిన ఘటన తర్వాత అక్రమంగా ధ్రువపత్రాలు తయారు చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. తపాలాశాఖ తనిఖీల్లో 37కి పైగా నకిలీ ధ్రువపత్రాలు వెలుగు చూశాయి.

స్కూటీ డిక్కీలో రూ4.50 లక్షలు దోపిడీ



నగదు భద్రపరిచిన స్కూటీ



బాధితుడు కుందిని నాయక్

బరంపురం: నగరానికి సమీపంలోని కుకుడాఖండి బ్లాక్‌కు చెందిన వ్యక్తి తన ఇంటి నిర్మాణం నిమిత్తం బ్యాంకు నుంచి డ్రా చేసిన రూ.4 లక్షల 50 వేలను దుండగులు దోచుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. దీనిపై ఐఐసీ అధికారి మృత్యుంజై స్వాయి తెలిపిన వివరాల ప్రకారం... సదర్ పోలీసు స్టేషన్ పరిధి సిద్ధార్థ నగరలో నివాసం ఉంటున్న కుందిని నాయక్ తన ఇంటి నిర్మాణం కోసం దాచుకున నగదును శనివారం నాలుగు బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేశారు. అనంతరం తన స్కూటీ డిక్కీలో పెట్టి, ఇంటికి పయనమయ్యాడు. అయితే గుర్తు తెలియని దుండగులు నగదు దోచుకొని పరారయ్యారు. ఘటనపై బాధితుడు పెద్ద బజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొయిలాపొడలో ఆక్రమణల తొలగింపు


- రైల్వే స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు అధికారుల ఏర్పాట్లు
- కట్టుబట్టలతో రోడ్డున పడిన బాధితులు



ఆందోళనలో కొయిలాపొడ బస్తీవాసులు



యంత్రాల సాయంతో ఇళ్లను తొలగిస్తున్న దృశ్యం



తొలగింపులను సమీక్షిస్తున్న రైల్వే అధికారులు

రాయగడ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు కొయిలాపొడ బస్తీని రైల్వే అధికారులు తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. రైల్వే స్థలంలో ఆక్రమించుకుని ఉన్న ఈ బస్తీని ఖాళీ చేయాల్సిందిగా పలుమార్లు సంబంధిత శాఖ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ బస్తీవాసులు పట్టించుకోలేదు. దీంతో శనివారం యంత్రాల సాయంతో ఇళ్లను తొలగించారు. ఈ బస్తీలో సుమారు 126 కుటుంబాలు గత కొన్నాళ్లుగా ఇదే స్థలంల్లో నివాసాలు ఏర్పరుచుకొని జీవిస్తున్నారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న రాయగడ.. రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రైల్వేశాఖ డివిజన్ కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు సన్నహాలు చేసింది. రైల్వేస్థలాల్లో ఆక్రమించుకుని ఉన్న వారిని తొలగించేందుకు నోటీసులు జారీ చేయండంతో పాటు మైకుల ద్వారా ఆయా ప్రాంతాల్లో రైల్వేసిబ్బంది ఇళ్లను ఖాళీ చేయాలని ప్రచారం చేశారు. దీంతో ఆక్రమణదారులు జిల్లా యంత్రాంగం దృష్టికి తమ సమస్యను వివరించారు. స్పందించిన అధికారులు.. నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు పట్టణంలోని పితామహాల్ పంచాయతీకి సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించింది. అయితే ఇప్పటి వరకు ఎవరికీ స్థలాలు కేటాయించలేదు. మరోవైపు ఆక్రమణలను తొలగించేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. శనివారం తొలగింపులకు శ్రీకారం చుట్టడంతో కొయిలాపొడ బస్తీవాసులు ఇళ్లను వదలి బయటకు వచ్చారు. పునరావాసం కల్పించకుండా ఇళ్లను తొలగిస్తే తామంతా ఎక్కడ తలదాచుకుంటామని ప్రశ్నించారు. అయితే ఈ విషయంలో తామేమీ చేయలేమని జిల్లా యంత్రాంగానికి తెలియజేసిన తరువాతే నిర్మాణాలు తొలగిస్తున్నామని అధికారులు సమాధానమిచ్చారు.

తొలగింపు అనివార్యం..

రైల్వే డివిజన్‌గా రాయగడ గుర్తింపు పొందడంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన స్థలాన్ని రైల్వేశాఖ సేకరిస్తుందని, ఈ క్రమంలో ఆక్రమణలను తొలగించడం అనివార్యమైందని రాయగడ రైల్వేశాఖ ఏడీఈఎన్ సంజీవ్ దీక్షిత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వే స్థలంలోని ఇళ్లను తొలగించాలని ఇదివరకే నివాసితులకు నోటీసులు ఇచ్చామని, వారిలో ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడంతో తొలగింపులకు సన్నద్ధమయ్యామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధి 1093 ఆక్రమణలను గుర్తించామని, అన్నిటినీ స్వాధీనం చేసుకుంటామని వివరించారు. మరోవైపు పోలీసు బందోబస్తు మధ్య తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టిన రైల్వే అధికారులు.. త్వరలో పట్టణంలోని మెయిన్ మార్కెట్, సంతోషిమాత మందిరం వెనుక ప్రాంతం, భీమోవీధి, కంద్రవీధి తదితర ప్రాంతాలను సైతం తొలగించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి



ఈశ్వరరావు మృతదేహం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన జనపరెడ్డి ఈశ్వరరావు(38) ఆత్మహత్యకు పాల్పడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. బొద్దాం గ్రామానికి చెందిన ఈశ్వరరావు శుక్రవారం రాత్రి 8 గంటలకు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పొట్టేళ్ల పందాలపై పోలీసుల దాడి



పందెంరాయుళ్లతో పాటు పొట్టేళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వీరఘట్టం: మండలంలోని కంబర గ్రామంలో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై శనివారం తెల్లవారుజామున దోనుబాయి ఎస్.ఐ కిషోర్ వర్మ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో రెండు పొట్టేళ్లు, ఒక బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని తొమ్మిది మంది పందెంరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ కృష్ణంనాయుడు తెలిపారు. రూ. 6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పేకాట శిబిరాలు నిర్వహించడం, పొట్టేళ్ల పందేలు జరిపించడం, క్రికెట్ బెట్టింగ్‌లు తదితర అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కిషోర్‌వర్మ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మరణించిన సూరమ్మ

డెంకాడ: మండలంలోని కొత్త ముంగినాపల్లి జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బొబ్బాది సూరమ్మ(61) మృతి చెందిందని ఎస్‌ఐ మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్త (ఎస్సీ)ముంగినాపల్లి గ్రామం నుంచి గుణుపూరుపేట వైపు వస్తున్న సూరమ్మను వెనుక వైపు నుంచి వచ్చిన మోటారు సైకిల్ ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సూరమ్మ అక్కడికక్కడే మరణించిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సూర్యారావు మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి సోపేరు గ్రామానికి చెందిన మామిడి సూర్యారావు (53) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ వై.రవికిరణ్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. నిత్యం మద్యానికి బానిసైన సూర్యారావు ఎప్పటిలాగే ఈ నెల 18న మధ్యాహ్నం కొంత మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. మిగిలిన మద్యం సేవించేందుకు పశువుల శాలకు చేరుకున్నాడు. శాలలో దాచి ఉంచిన గడ్డి మందును మద్యం అనుకుని సేవించాడు. ఇది గమనించిన అతని భార్య సుజాత ఆటోలో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. తిరస్కరించడం జరుగుతుందని వివరించారు.

గుర్తు తెలియని మహిళ మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక ఎన్‌సీఎస్ థియేటర్ పక్కన ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఎదురుగా సుమారు 45 నుంచి 55 ఏళ్ల మధ్య ఉన్న మహిళ మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. కుటుంబ సభ్యులెవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ వెంకటరావు కోరారు.

ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: తన అకౌంట్ నుంచి డబ్బులు విత్ డ్రా అయినట్లు రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న ఉమ అనే మహిళ ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం తెలిపారు. గుర్తు తెలియని మెసేజ్‌లు, లింక్ ఓపెన్ చేయడంతో వారి అకౌంట్ నుంచి రూ.88వేల 435 విత్ డ్రా అయినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ముగిసిన 'బార్' ఎన్నికలు

- వివిధ కోర్టుల్లో ఓటు హక్కు వినియోగించుకున్న న్యాయవాదులు



బరంపురం: ఓటు హక్కు వినియోగించుకుంటున్న నగర మేయర్ సంఘమిత్ర దొళాయి



బరంపురం: జిల్లా కోర్టు ప్రాంగణలో న్యాయవాదుల సందడి



రాయగడ: ఎన్నికల్లో పాల్గొన్న న్యాయవాదులు



రాయగడ: బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



పర్లాకిమిడి: అధ్యక్షుడు సిద్ధేశ్వర మిశ్రా, పక్కన పంటల ప్రసాద్, పృథ్వీరాజ్ చౌహాన్

బరంపురం: గంజాం, రాయగడ, పర్లాకిమిడి కోర్టుల్లో బార్ అసోసియేషన్ 2023–24 ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. బరంపురంలోని గంజాం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ప్రక్రియలో ఎన్నికల అధికారిగా అక్షయ్‌కుమార్ పట్నాయక్ వ్యవహరించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఓటింగ్‌లో సీనియర్, జూనియర్ న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో అధ్యక్ష పదవికి ఆరుగురు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, కార్యదర్శి పదవికి ఆరుగురు, సహాయ కార్యదర్శి పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు అక్షయ్ పట్నాయక్ తెలిపారు. మొత్తం 1,519మంది ఓటర్లు ఉండగా.. 1,338 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో మినతి రథ్ తన సమీప ప్రత్యర్థి శేఖర్ పండాపై 93ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్, కార్యదర్శిగా శివ నారాయణ పాత్రో, సహాయ కార్యదర్శిగా తపన్‌కుమార్ సాహు గెలుపొందారు. ఇదిలా ఉండగా.. గంజాం బార్ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా తొలిసారి మహిళ ఎన్నిక కావడం గమనార్హం.

అధ్యక్షుడిగా దేవీ పట్నాయక్..

రాయగడ: రాయగడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవిప్రసాద్ పట్నాయక్ విజయం సాధించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన పోలింగ్‌లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన దేవిప్రసాద్‌కు 69మంది అనుకూలంగా ఓట్లు వేశారు. ప్రత్యర్థులు ఉమాకాంత మిశ్రాకు 51, మోహన్ నాయక్‌కు 28 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్ష పదవికై బరిలో ఉన్న పద్మనాభ దాస్(టుటు)కు 87, సురేంద్రకుమార్ శర్మకు 62 ఓట్లు రాగా.. దాస్ 25ఓట్ల మెజారీతో గెలుపొందారు. కార్యదర్శి పదవికి బరిలో ఉన్న విశ్వనాథ్ గంతాయత్‌కు 95 ఓట్లు, మేఘనాథ్‌కు 55 ఓట్లు వచ్చాయి. సహాయ కార్యదర్శిగా పోటీలో ఉన్న గురుప్రసాద్ దాస్‌కు 62 ఓట్లు, రామకృష్ణ పల్లికి 85 ఓట్లు పోలయ్యాయి. కోశాధికారి పదవికి పోటీ చేసిన మానస్‌రంజన్ దాస్‌కు 61 ఓట్లు, దమయంతి మహానందియాకు 88 ఓట్లు వచ్చాయి. జిల్లా కోర్టులో 154మంది ఓటర్లు ఉండగా.. 151మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి రాజేంద్ర సేనాపతి వెల్లడించారు.

సిద్ధేశ్వర మిశ్రా విజయం..

పర్లాకిమిడి: జిల్లా కోర్టు సముదాయంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు సజావుగా జరిగాయి. ఇందులో అధ్యక్షుడిగా సిద్ధేశ్వర మిశ్రా(డుల్లు) తన సమీప ప్రత్యర్థి పంటల ప్రసాద్‌పై 12ఓట్ల వ్యత్యాసంతో గెలుపొందారు. అసోసియేషన్ కార్యదర్శిగా ఎం.పృథ్వీరాజ్ చౌహాన్ 48 ఓట్ల తేడాతో కృష్ణ పట్నాయక్ విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీగా సత్యనారాయణ పాఢి, ఉపాధ్యక్షుడిగా ఆర్.బాబూరావు, కోశాధికారిగా శశాంక శేఖర సాబత్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.తాతయ్య వ్యవహరించారు. గెలుపొందిన అభ్యర్థులను పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, న్యాయవాదులు, వీఎస్ఎన్ రాజు, బండి విశ్వనాథం, మండలి, రామనాథ్ అభినందనలు తెలియజేశారు.

భీరేష్ పట్నాయక్ మరోసారి..

జయపురం: కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయపురంలోని జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 415 మంది ఓటర్లలో 391మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి శశాంత మిశ్రా వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ నిర్వహించగా, అనంతరం లెక్కింపు చేపట్టారు. ఇందులో అధ్యక్ష పదవికి ప్రస్తుత అధ్యక్షుడు భీరేష్ పట్నాయక్, రవీంద్ర పాత్రోలు తలపడ్డారు. పాత్రోకు 183 ఓట్లు పోలవ్వగా.. 24 ఓట్ల ఆధిక్యంతో మొత్తం 207ఓట్లతో భీరేష్ విజయం సాధించారు. కార్యదర్శిగా శరత్ మాఝి, ఆనంద రథోపై 22 ఓట్ల వ్యత్యాసంతో, ఉపాధ్యక్షుడిగా 40ఓట్ల తేడాతో గోకుల సూర్యపై సహదేవ్ పట్నాయక్ గెలుపొందారు. సహాయ కార్యదర్శిగా పి.సన్యాసిరావు, జాయింట్ సెక్రటరీగా రాజేంద్ర మదల, కోశాధికారిగా గిరిధర ఖొర, గ్రంథాలయ కార్యదర్శిగా సురేంద్రకుమార్ హడప, గ్రంథాలయ సహాయ కార్యదర్శిగా చందన నాయక్ ఎన్నికయ్యారు.



పర్లాకిమిడి: కోర్టు ప్రాంగణంలో ప్యానెల్ సభ్యులతో సిద్ధేశ్వర మిశ్రా



బరంపురం: విజయ సంకేతం చూపుతున్న మినతి రథ్, నూతన కమిటీ



అధ్యక్షుడు భీరేన్ పట్నాయక్‌తో ఉపాధ్యక్షుడు సమదేవ్ పట్నాయక్, కార్యదర్శి శరత్ మాఝి

390 కిలోల గంజాయి పట్టివేత

- 3 కార్లు, వ్యాన్, ఆటో స్వాధీనం
- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



కళింగా ఘాటీలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి



300 కిలోల గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: కొందమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల్లో గంజాయి మాఫియా కార్యకలాపాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్‌కుమార్ సింగ్ ఆదేశాల మేరకు బరంపురం జిల్లా ఎక్సైజ్ విభాగం అధికారులు బరంపురం నగర శివారులో శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పుకిడిబొంధా 16వ నంబర్ జాతీయ రహదారిలో సోదాలు చేయగా, 300 కిలోల గంజాయి పట్టుబడింది. సరుకుతో పాటు వాటిని తరలిస్తున్న 3 కార్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేయగా.. నిందితులు ఝార్కండ్ రాష్ట్రానికి చెందిన ఫిరోజ్‌ఖాన్, మహ్మద్ సరఫ్, గంజాం జిల్లా పులసరా బ్లాక్ పరిధి మహేశ్వర్ పాత్రో, అజీత్ బెహరాగా గుర్తించారు. సీజ్ చేసిన గంజాయి విలువ రూ.30 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుబేర్‌కుమార్ సెతి తెలిపారు. అలాగే కొందమాల్–గంజాం జిల్లా సరిహద్దు కళింగా ఘాటీపై బల్లిగుడా పోలీసులు వ్యాన్‌లో తరలిస్తున్న 90 కిలోల గంజాయిని సీజ్ చేశారని ఏఎస్పీ సురేంద్రకుమార్ పాత్రో తెలిపారు. దీనికి సంబంధించి ఆటోతో పాటు నిందితుడుని అరెస్ట్ చేశారు.

కాంగ్రెస్ నిరసన ప్రదర్శనలు



రాయగడ: కపిలాస్ కూడలిలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

పర్లాకిమిడి: కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీ రాహుల్‌గాంధీపై కేంద్రప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆపార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధానమంత్రి మోదీపై రెండేళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలపై సూరత్ కోర్టు జైలు శిక్ష విధించడంపై మండిపడ్డారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సొండివీధిలో కాంగ్రెస్ కార్యాలయం నుంచి హైస్కూల్ జంక్షన్ వరకు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గమాంగో నేతృత్వంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆందోళనలో సీనియర్ నాయకులు బసంత పండా, మోహనా బ్లాక్ నాయకులు బాలకృష్ణ మల్లిక్, రమేష్‌బిశోయి, నిర్మలా పాల్, లక్ష్మణ పాయక్, లక్ష్మణ దొళాయి, సూర్యనారాయణ పాత్రో, సంగ్రాం సాహు, రాజా పాత్రో, అభిమన్యు పండా తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయగడలో..

రాయగడ: కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసిస్తూ రాయగడ జిల్లా కాంగ్రెస్ కమిటీ నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు స్థానిక కపిలాస్ కూడలిలో ఆ పార్టీ శ్రేణులు అప్పల స్వామి కడ్రక నేతృత్వంతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మజ్జి శంకరరావు తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 31 వరకు సబ్ జూనియర్స్, కాడెట్ విభాగాల్లో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించారు. జాతీయ తైక్వాండో పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల్లో ఎస్.షణ్ముఖ సిద్దార్థ నాయుడు, బొంగు యశస్విని, జి.జాహ్నవి, జి.చరిత, సీహెచ్ హర్షవర్ధన్, కె.మోక్షిత్ ఉన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యాలు, కార్యదర్శి సి.హెచ్. వేణుగోపాలరావు, కోచ్‌లు టి.రాజు, కె.కోటేశ్వర రావు అభినందించారు.

టెక్నాలజీతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు



రాజాం సిటీ: విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని అందిపుచ్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవకాశం ఉంటుందని కార్పొరేట్ కన్సల్టెంట్, సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ ప్రభాత్‌కుమార్ అన్నారు. జీఎంఆర్ ఐటీలో శనివారం నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన లక్ష్యాల వైపు పయనించాలని అన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా గతాన్ని మర్చిపోకూడదని తెలిపారు. ప్రతిభను పెంపొందించుకునేందుకు విదేశాలకు సైతం వెళ్లాలని సూచించారు. సొంత ఆలోచనా శక్తితోనే మంచి వ్యవస్థ స్థాపించి పది మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలకు ఎన్ఐఆర్ఎఫ్ గుర్తింపుతో దేశంలోనే 188వ ర్యాంకు రావడంతో పాటు నాక్–ఏ గ్రేడు, 5యూజీ ప్రోగ్రామ్స్ ఎన్‌బీఏ గుర్తింపు పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులను సత్కరించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గొలివే గేమ్స్ గ్రూపు సీఈఓ పి.రవికిరణ్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, సీఈఓ ఎల్ఎం లక్ష్మణమూర్తి, గ్రంధి నీలాచలం, విద్యార్థులు, వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న పిడుగుపాటుకు గురైన మహిళ

గుర్ల: మండలంలోని కొండగండ్రేడులో శనివారం పడిన పిడుగు పాటుకు నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన మంత్రి అప్పలరాములు, మంత్రి సింహచలం, పరాల జయ, పొట్నూరు లక్ష్మి శనివారం సాయంత్రం పొలాల్లో మొక్కజొన్న పంట పనిలో ఉన్నారు. ఒక్కసారిగా వాతావారణం మారడంతో ఉరుములతో కూడిన వర్షం పడింది. మహిళలు పనిచేస్తున్న కొద్ది దూరంలో పిడుగు పడడంతో నలుగురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. ఇది గమనించిన స్థానికులు 108 సహాయంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారులు చికిత్స అందిస్తున్నారు. నలుగురు మహిళలకు చికిత్స అందిస్తున్నా.. స్పృహలోకి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆనంద్

- జేసీ ఆనంద్

పార్వతీపురం టౌన్: అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ పక్షోత్సవాలను పురస్కరించుకుని గత పదిహేను రోజులుగా జరుగుతున్న వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు విద్య, వైద్య, శిశు సంక్షేమ శాఖల నుండి ప్రతిభ కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయంగా రాణిస్తున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన మన జిల్లాలో విద్యా, వైద్య, శిశు సంక్షేమ రంగాల్లో మహిళలు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో భారతదేశం ప్రథమ స్థానంలో ఉండాలంటే మహిళలు ముఖ్య పాత్ర వహించాలని జేసీ సూచించారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరంగా మహిళలు, పురుషులు సమానమేనని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలంతా శాంతియుతంగా, ప్రశాంతంగా జీవించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి జరుపుకోవాలని సూచించిదన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొన్న, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారాలను అందజేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి విజయగౌరీ, డీఈఓ ఎస్‌డీవీ రమణ, డీఎంహెచ్ఓ బగాది జగన్నాధరావు, క్రీడా సాధికారత అధికారి కె.రామ్‌గోపాల్, క్రీడా శాఖ జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వరావు, ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, క్రీడా సాధికారత కో – ఆర్డినేటర్ గాంధీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూలు


ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాల కోసం శనివారం కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించారు. డీఆర్‌ఓ ఎం.రాజేశ్వరి 27 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి సర్టిఫికెట్లు పరిశీలించారు. వీరికి ఖాళీగా ఉన్న సచివాలయాలు, ఆర్టీసీ శాఖల్లో ఉద్యోగాలు ఇవ్వనున్నారు. సచివాలయాల్లో సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌లుగా అవకాశం కల్పించనున్నారు. ఆర్టీసీలో (ప్రజా రవాణా సంస్థ)లో డ్రైవర్, కండక్టర్, గ్యారేజీలో పోస్టులు వీరికి కేటాయిస్తారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, డీటీ సాదు శంకరరావు, ఢిల్లీతో పాటు ఆర్టీసీ అధికారులు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

శ్రీకాకుళం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు 2023-24కు గాను 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి గాను ఈనెల 31 వరకూ గడువును పెంచినట్లు శ్రీకాకుళం పెదపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రిన్సిపాల్ యశోదలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా దరఖాస్తు చేయనివారు ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థి ఆధార్ నంబర్, సెల్‌ఫోన్, పుట్టిన తేదీతో పాటు ఆన్‌లైన్‌లో ఏపీజీపీసెట్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

అనుమతుల్లేని టేకు పట్టివేత

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ పరిధిలో గల చిన్నహంస గ్రామంలో అనుమతులు లేని టేకు కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వరిశి ఢిల్లీశ్వరరావు అనే వ్యక్తి అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికి సుమారు 40 దుంగలను ఆయన ఇంటి ఆవరణలో వేయడంతో గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు గ్రామానికి చేరుకుని కలపను పరిశీలించారు. జిరాయితీ భూమిలోని కలపను ఎలాంటి అనుమతులు లేకుండా నరికినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి కలపను స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే గేటు వద్ద నిలిచిన బస్సు


దారికి అడ్డంగా ఆగిపోయిన బస్సు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వాహనదారులతో అత్యంత రద్దీగా ఉండే కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. పలాస ఆర్టీసీ డిపో నుంచి మెళియాపుట్టి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు రైల్వే ట్రాక్ దాటాక నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గేట్‌మెన్ అప్రమత్తం కావడంతో ప్రమాదం జరగలేదు. అనంతరం వన్‌వేలో వాహనాలను విడిచిపెట్టి బస్సుకు మరమ్మతులు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ఘటనా స్థలంలో అప్పారావు మృతదేహం

కంచిలి: మండలంలోని మకరాంపురం కూడలి వద్ద శనివారం 'ఆదివారం సంత' ప్రాంగణం ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అంపురం గ్రామానికి చెందిన మల్లార్పు అప్పారావు(58) దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. అప్పారావు, మరో ఐదుగురు కలిసి సంత వద్ద సరుకులు అన్‌లోడ్ చేయడానికి వెళుతుండగా ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య తిరుపతమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్.చిరంజీవీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గార: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎయిడ్స్, టీబీ, కుష్టు వంటి రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.అనూరాధ అన్నారు. శనివారం అంపోలు జిల్లా జైలులో ఎయిడ్స్ నివారణ సంస్థ, సాతి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఖైదీలకు సుఖవ్యాధులు, టీబీ రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ నబీఖాన్, జైలర్లు దివాకర్, శంకరరెడ్డి, చిరంజీవి, ఎస్.మేనక తదితరులు పాల్గొన్నారు.




రేవులో రాముడి మనువు

దశరథుడు లేని లోటు కనిపించదు.. రాముడి పెళ్లికి ఆ ఊరంతా పెద్దలే. కన్యాదానానికి జనకుడే రానక్కర్లేదు.. సీతమ్మ అక్కడ ప్రతి ఇంటి దేవత. శివుడి విల్లు విరగ్గొట్టే విన్యాసం ఉండదు. జానకిరాముల జంట వారికి కన్నులపంట. రాముడి జననం నుంచి రావణ దహనం వరకు, త్రేతాయుగం నుంచి కలియుగం వరకు ఏ సందేహానికైనా సమాధానం నువ్వలరేవులోని శ్రీరామనవమి ఉత్సవం. ఇక్కడ సీతారాముల కల్యాణం చేస్తారు. రామాయణాన్ని నాటకాల రూపంలో ప్రదర్శిస్తారు. రావణ దహనాన్ని అందరి ముందు నిర్వహిస్తారు. అనాదిగా వస్తున్న ఆచారాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ముందు తరాలకు అందిస్తున్నారు.

- సాగరతీరంలో సీతారాముల పరిణయ వేడుక
- శ్రీరామనవమి ఉత్సవాలకు నువ్వలరేవు సంసిద్ధం
- నేటి నుంచి ఏప్రిల్ 6 వరకు కన్నుల పండువగా ఉత్సవాలు


నువ్వలరేవు గ్రామ ముఖద్వారం

సండే స్పెషల్

వజ్రపుకొత్తూరు రూరల్:

సాగరతీరం సీతారాముల కల్యాణానికి సిద్ధమవుతోంది. నువ్వలరేవు గ్రామంలో నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో సామూహిక వివాహాలు అందరికీ తెలిసిన ప్రత్యేక వేడుక. కానీ ఇక్కడ జరిగే శ్రీరామనవమి వేడుకలు అంతకంటే ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఈ గ్రామంలో సుమారు 3,300 ఇళ్లు ఉండగా దాదాపుగా 12 వేల మంది జనాభా ఉన్నారు. బెహరాల మాటే శిరోధార్యంగా భావించే ఈ పల్లెలో వారి మాట ప్రకారమే.. ఏటా శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. నేటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

ఉత్సవ ఉత్సాహం

తాము ఎక్కడ ఉన్న గ్రామ దేవత బృందావతి అమ్మవారి చల్లని దీవెనలు, సీతారాముల కరుణా కటాక్షాలు తమపై ఎల్లప్పుడూ ఉంటాయని గ్రామస్తుల విశ్వాసం. అందుకే సుమారు రూ.50 లక్షల వరకు వెచ్చించి సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. తమ గ్రామంలో కన్నుల పండుగగా జరిగే సీతారాముల కల్యాణం చూసేందుకు వలస పక్షులంతా తిరిగి వస్తారు. శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో ఊరంతా కొత్త వెలుగులు సంతరించుకుంటాయి.

కార్యక్రమాలివే..

ఆదివారం సాయంత్రం దాసుడి ఇంటి నుంచి దేవరతో బయలుదేరి తకురాణి అమ్మవారికి పూజలు చేసి జెండా ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. మళ్లీ ఏప్రిల్ 6వ తేదీన రావణ సంహారంతో వేడుక లు ముగుస్తాయి. మొదటి రోజున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తూ నైవేద్యాలు సమర్పిస్తారు. 27వ తేదీన చిన్న పండగ నిర్వహించి పగటి వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు. 28వ తేదీన పెద్ద పండగ నిర్వహిచి అమ్మవార్లకు చల్లదనం, మొక్కులు తీర్చుకుంటారు. తర్వాత వయస్సు భేదం లేకుండా ఆటపాటలు ఉంటాయి. శ్రీరామనవమి (30న) రోజున ముందుగా గ్రామ దేవత బృందావతి అమ్మవారి ఆలయం వద్ద జెండాను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే రామాలయం వద్ద మరో జెండాను ఆవిష్కరించి హోమం, యజ్ఞాలతో పండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతారాములు కల్యాణం కన్నుల పండగగా జరుపుతారు. తర్వాత రోజు నుంచి 6వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. కర్రసాము, గారడీ, పాండురంగ, రామ నాటకం, రామయ్య పట్టాభిషేకం, మండపారాధన, కోయి డాన్స్, రావణ దహనం వంటివి నిర్వహిస్తారు.



ఐకమత్యంగా నవమి ఉత్సవాలు



తరతరాలుగా వస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఐకమత్యంతో జరుపుకుంటున్నాం. మా ఇంటి ఇలవేల్పుగా బృందావతి అమ్మవారిని కొలుచుకుంటూ మాకు ఆదర్శ దైవంగా నిలిచిన శ్రీరాముడు, సీతమ్మలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏటా వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

– మువ్వల ఎఱ్ఱా, ఉత్సవ కమిటీ సభ్యులు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం.

ఆచారాలకు పెద్ద పీట



తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలకు పెద్ద పీట వేస్తాం. వలస కూలీలు ఎక్కడ ఉన్నా స్వగ్రామానికి చేరుకుంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, పూజారులు, యువకుల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తాం.

– నీలాంబర్, సొసైటీ అధ్యక్షుడు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం.

గర్వంగా ఉంది



భద్రాద్రి రామయ్యకు మా గ్రామంలో వైభవంగా కల్యాణ మహోత్సవం ఏటా చేస్తుంటాం. ఎన్నో ప్రత్యేకతలకు నిలయంగా ఉన్న నువ్వలరేవులో పుట్టడం నిజంగా గర్వంగా ఉంది. ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా అందరి సహకారంతో ఉత్సవాలు జరుపుకుంటాం.

– మువ్వల దేవ, ఉత్సవ కమిటీ సభ్యులు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం

ప్రత్యేక అలంకరణలో వెంకన్న



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం చిన్నబజారులో కొలువై ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామిని తులసి, పూలమాలతో అందంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మేలుజాతి దూడల ప్రదర్శన


వినూత్నంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన

జి.సిగడాం: గ్రామాల్లో మేలుజాతికి చెందిన ఆవులను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా నడిమివలస గ్రామంలో శనివారం మేలుజాతికి చెందిన లేగ దూడలన్నీ ఒకే దగ్గర ఏర్పాటు చేసి మెరుగైన, ఆరోగ్యకరమైన దూడలు పెంచిన రైతులకు సంబంధిత పశువైద్య అధికారులు బహుమతులను అందించారు. ప్రదర్శించిన లేగదూడలను చూసేందుకు ప్రజలు, రైతులు అధికసంఖ్యలో వచ్చారు.

నేడు రెవెన్యూ సర్వీసుల సంఘం ఎన్నిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆది వారం రెవెన్యూ వసతి గృహంలో జగరనున్నట్టు ప్రస్తుత జిలా కార్యదర్శి బీవీఎస్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో మూడు రెవెన్యూ డివిజన్ల యూనిట్లు, కలెక్టరేట్ యూనిట్లతో పాటు ఓటు ఉన్న వారు హాజరుకావాలని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియం ఉదయం 10 నుంచి ప్రారంభమై సాయంత్రానికి ముగుస్తుందన్నారు.

కళలను ఆదరించాలి


కమనీయం నాటికలో ఓ సన్నివేశం


అభినయ నృత్య నికేతన్ నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్ : కళలను ప్రతిఒక్కరూ ఆదరించాలని, నాటక కళను బతికించేందుకు సుమిత్రా కళాసమితి చేస్తున్న కృషి ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. అరసవల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన వైజయంతి వేదికపై ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని నాటిక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా అభినయ నృత్యకేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కొంచాడ సోమేశ్వరరావు, దేవదాయశాఖ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, సుమిత్రా కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు, లోకనాథం రామలింగేశ్వరరావు, నందికేశ్వరరావు, నక్క శంకరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

గుంటూరు, సద్గురు కళానిలయం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కమనీయం నాటిక ఆద్యంతం అలరించింది. విద్యాధర్ మునిపల్లి రచించగా, బసవరాజు దర్శకత్వం వహించారు. అక్కా చెల్లెళ్లు తమ కాపురాలను చక్కబెట్టుకునే సన్నివేశాలతో సాగిన 'అక్క అలుగుడు-చెల్లి సణుగుడు' నాటిక సైతం ఆకట్టుకుంది. అద్దేపల్లి భరత్‌కుమార్ రచించగా, షేక్ షఫీ దర్శకత్వం వహించారు.

ఉత్తరాంధ్ర కవితల పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: కవితా నిలయం, తపస్వి మనోహరం సంయుక్త నిర్వహణలో ఉత్తరాంధ్ర వచన, పద్య కవితల పోటీల నిమిత్తం కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు మహ్మద్ రఫీ(ఈవేమన), జంధ్యాల శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదనం, సామాజిక బాధ్యతకు సంబంధించి ఒక్కొక్కరు 20 వరుసలకు మించని వచన కవిత, 5 పద్యకవితలను మే5లోగా పంపించాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. కవితలను మహ్మద్ రఫీ(ఈవేమన) ఎస్.1, శారదా అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, రణస్థలం-532407 చిరునామాకు గానీ, 9059690733 వాట్సాప్ నంబరుకు గానీ పంపించాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాతపట్నం: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఒడిశా నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని ఆపి పత్రాలు పరిశీలించారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ సింహాచలం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చిన్నారిని ఆదుకోరూ..!

- 'న్యూరో బ్లాస్టోమా' క్యాన్సర్‌తో పోరాడుతున్న ఐదేళ్ల యోగేంద్ర
- దాతల సాయం కోసం ఎదురుచూపు


క్యాన్సర్‌తో బాధపడుతున్న లండ యోగేంద్ర(ఫైల్)

కంచిలి: ఆడుకోవాల్సిన వయసులో ఆ చిన్నారికి పెద్దకష్టం వచ్చిపడింది. ఐదేళ్ల ప్రాయంలోనే క్యాన్సర్ వ్యాధి సోకి తీవ్ర అనారోగ్యానికి గురిచేస్తోంది. సుమారు రూ.25 లక్షల వరకు చికిత్సకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో పేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కంచిలి మండలం పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లండ భూషయ్య, కేతిక దంపతుల ఐదేళ్ల కుమారుడు లండ యోగేంద్రకు న్యూరో బ్లాస్టోమా అనే క్యాన్సర్ వ్యాధి సోకింది. ప్రస్తుతం నాలుగో స్టేజ్‌లో ఉంది. ప్రస్తుతం విశాఖపట్నంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కీమోథెరపీ జరుగుతోంది. దీని తర్వాత శస్త్రచికిత్స కోసం సుమారు రూ.25లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొన్నారు. చిన్నారి తండ్రి భూషయ్య సోంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద మొత్తంలో శస్త్ర చికిత్స కోసం అవసరం కావడంతో ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు. దాతలే తమ బిడ్డను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిన్నారికి సాయం చేయదల్చినవారు భూషయ్య స్నేహితుడు తెలుకుల బృందావనం(కాంటాక్ట్ నంబర్: 93813 78837, ఫోన్‌పే నంబర్:9603992643) సంప్రదించవచ్చు.


జొన్న చేగోడియాలు, జంతికలు, సేవ్


కొర్ర అరిసెలు


కొర్ర పొంగడాలు


నల్ల బియ్యం ఉండలు


అవిశ గింజలు



రాగులు

చిరుధాన్యాలకు.. ప్రాధాన్యం


2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిరు ధాన్యాలు, వాటితో తయారు చేసిన ఆహార ఉత్పత్తులను ప్రదర్శించారు. ఆసరా కార్యక్రమానికి విచ్చేసిన వారికి చిరుధాన్యాల ఆవశ్యకతను అధికారులు వివరించారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, అంగన్‌వాడీ, డీఆర్‌డీఏ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఉన్నతాధికారులు తిలకించారు.

-శ్రీకాకుళం పాతబస్టాండ్/సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం


చిరు ధాన్యాల స్టాల్స్‌ను సందర్శిస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు


రాగి అప్పడాలు



చిరు ధాన్యాలను కొనుగోలు చేస్తున్న మహిళలు


జొన్నలు


అరికెలు


సామలు


అంటు కొర్రలు


గంటెలు


కొర్రలు